


# బాధ్యత

మనస్విని

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

"అమ్మా, శర్మగారు ఎలాగున్నారు?" అడిగాడు రమేశ్. సొంత ఊరిలో కొన్ని ఏళ్ళ తర్వాత తహశీల్దారు హోదాలో అడుగుపెట్టాడు. కొడుకు ఉన్నతి చూసి, పొంగిపోయింది ఆ తల్లి.

"ఎవర్రా, శర్మగారు?" అడిగింది విజయ్యమ్మ.

"ఆయనేనే, మా తెలుగు మాష్టారు, మన ఇంటి దగ్గర గుడిలో పూజలు చేసేవారు!"

"ఓహ్, పెద్దపంతులుగారా? ఆయన నీకు శర్మగారు ఎప్పటినుంచి? హై స్కూలుకని ఈ ఊరు వదిలేంతవరకు, ఆయన్ని పంతులు అనే వాడివిగా?"

"లేదమ్మా, ఆయన గురించి చెప్పుడు మాటలు విని, ఆయన అహంకారి అనుకుని, అలా అనేవాడిని. ఆయన పద్ధతులు, అప్పట్లో నాకు ఆయన ఆచారాలు నచ్చేవి కావు"

మాటకు అడ్డు తగులుతూ, "ఆయన కష్టం వింటే, కడుపు ఎవరికైనా తరుక్కు పోతుంది. ఈ వయస్సులో కొడుకు అన్నీ చూసుకుంటాడు అనుకుంటే, అతనే సంపాదన సరిగ్గా లేక ఇబ్బంది పడుతున్నాడు. చినపంతులుగారు ఊర్లోనే ఉద్యోగం చేసుకుంటాడు అనుకుంటే, ఆ స్కూలు పిల్లలులేక మూతబడింది. గుడికి కూడా జనాలు రావడం తక్కువైపోయింది. పెద్దపంతులుగారు ముసలివాడైపోయాడు. పెన్షన్ కూడా సరిగ్గా రాదు. ఉన్న రెండెకరాల పొలం కూతురు పెళ్ళికి అమ్మేశారు."

"అయ్యో, ఒడలు బండ్లవ్వడమంటే ఇదేనేమో" అంటూ వీధిలోకి వెళ్ళిపోయాడు రమేశ్.

★★★

"ఏరా, గుడికి నెలనెలా వెయ్యి రూపాయలు ఇస్తానన్నావంట, చినపంతులుగారు చెప్పారు," నెల తర్వాత ఊరికి వచ్చిన కొడుకును అడిగింది విజయమ్మ.

"నా జేబులోంచి కాదులే, ప్రభుత్వం ఇస్తోంది, దానికి కావలసిన ఏర్పాటు చేయించాను. తహసీల్దారు అయ్యుండి మన ఊరికి నేను చెయ్యకపోతే ఇంకెవరు చేస్తారు?" చెప్పాడు రమేశ్.

"అదేంటి, నీకూ గుడి అంటే పడదు కదా, అక్కడ మనకి విలువ లేదు, నన్ను అక్కడికి వెళ్ళడం మానెయ్యమని పోరుపెట్టేవాడివి?"

"నేను గుడిని, గుడిలో రాయిని నమ్మను, నాకూ నేను రోజూ కొలిచే దేవుడు ఉన్నారు. సాటి వాడికి సహాయం చేసినవాడు ఎవ్వరైనా నాకు దేవుడే. నాకు చిన్నప్పుడు పంచుకోవడంలో ఉన్న సుఖం నేర్పాడు ఒక దేవుడు. అదే చేస్తున్నా, ఇది నా బాధ్యత," తేల్చేశాడు రమేశ్.

"ఇంతే కాదు, మూతబడ్డ అప్పర్ ప్రైమరీ కూడా మళ్ళీ తెరుచుకుంటుంది. ఊరికి కొత్త మాస్టారు అవసరం లేదు. మీ చిన పంతులుగారు ఉన్నారుగా? మరి అందులో పిల్లలాంటావా, అది నీ బాధ్యత. ఈ పేటలో ఉన్న పిల్లలందరూ ఆ బడికి వెళ్ళాలి. నువ్వు ఏమి చేస్తావో, ఎలా చేస్తావో నాకు తెలియదు. అవసరమైతే, చిన్నప్పుడు నన్ను బెత్తంతో బెదిరించే దానివే, అలాగ మళ్ళీ చెయ్యి," ఆజ్ఞ వేశాడు కొడుకు. కించిత్ గర్వం కలిగింది విజయమ్మకు. తన ఇంటివాడు జబ్బు చేసి అనుకోకుండా పోయి, కొడుకు ఎమైపోతాడో అని భయపడుతూ ఉంటే, పెద్దపంతులుగారు సముదాయిస్తూ చెప్పిన మాటలు గుర్తుకు వచ్చాయి. "నీ కొడుకు మొండి వాడే కాని, తెలివిగలవాడు. నువ్వు చేస్తున్న సేవకు ఆ దేవుడు మంచి దోవ చూపెడతాడులే". మనసులోనే ఆయనకీ దణ్ణం పెట్టుకుంది.

అలా అడుగులు వేస్తూ, శర్మగారి ఇల్లు దాటి గుడిదాటి కోనేరు దాకా వెళ్ళాడు. అక్కడే మెట్ల మీద కూర్చుని, గతాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు.

★★★★★★★★★

"ఎవర్రా అక్కడ గొడవపడేది?" అడిగాడు శర్మగారు.

"నాన్నా, వీడు రమేశ్ మన మావిడి చెట్లోంచి కాయలు  దొంగలించి తీసుకుపోతున్నాడు," నెపం మోపాడు శర్మగారి అబ్బాయి మనోహర్.

శర్మగారు దగ్గరకు వచ్చి అడిగారు. "అయ్యా, ఈ వేళ ఉగాది కదా, పచ్చడి చేసుకుందామని అమ్మ చెబితే, ఒక మామిడికాయ కోసం వచ్చా. అమ్మ ఇచ్చిన డబ్బులకి, చింతపండు, బెల్లం మటుకే వచ్చాయి. వేప పువ్వు గుడి దగ్గర చెట్లో దొరికింది. మామిడికాయ కోసం వచ్చా. ఒక్కటి చాలు అయ్యా మాకు. మా ఇంట్లో ముసిలి తాత చాల ఇష్టంగా అడిగితే మా అమ్మ కూలి డబ్బులలోంచి ఇచ్చింది" చెప్పాడు రమేశ్.

"నువ్వు విజయ్యమ్మ కొడుకువి కదూ?" రోజు గుడిలో ఏంతో సేవ చేసే విజయంమని గుర్తు చేసుకుంటూ అడిగాడు శర్మగారు. అవునంటూ తల ఊపాడు.

"మనోహర్, వాడికి ఆ మామిడికాయతో బాటు, ఇంకో నాలుగు  ఇవ్వు, ఆవకాయ పెట్టుకుంటారు. అలాగనే మీ అమ్మనడిగి, ఒక సోలెడు ఆవ పిండి కూడా తీసుకురా", ఆజ్ఞాపించాడు శర్మగారు.

"నాన్నా, వాడు దొంగతనంగా తీసుకువేళ్తున్నాడు, వాడికి ఇవన్నీ...?" అడిగాడు మనోహర్. ఇద్దరూ ఒకే క్లాసులో చదువుకోవటంవల్ల పోటీ ఎక్కువ.

"ఒరేయ్, మన చెట్టుకు కొన్ని వందల కాయలు కాస్తాయి, మనకి కావలసినవి కాకుండా మిగతావి పంచితేనే, ఆ చెట్టు ఇంకా ఎక్కువ కాస్తుంది. పంచుకోవటంలో ఉన్న సుఖం తెలుసుకోరా" అంటూ, కొన్ని మామిడి రెమ్మలు కూడా కోసుకోమని చెప్పాడు శర్మగారు.

జూన్ నెల స్కూలు మొదలుకాబోతోంది. ఊరిలో ఉన్న అప్పర్ ప్రైమరీ స్కూలుకు తెలుగు మాస్టరు తోబాటు, హెడ్మాస్టారుగా చేస్తున్నారు శర్మగారు. రమేశ్, మనోహర్ ఇద్దరు హైస్కూల్ లోకి వచ్చారు. ఉన్న ఊరిలోకన్నా, ఇరవై మైళ్ళ దూరంలో ఇంకా మంచి స్కూలు హాస్టల్ తో కూడి ఉంది. రమేశ్ తెలుసుకున్న దాని ప్రకారం పక్క ఊర్లో ఉన్న హై స్కూల్లో ఒకే సీటు ఖాళీ ఉంది, దానికీ, శర్మగారి రెకమెండేషను ఉంటే ఖచ్చితంగా ఇస్తారు. ఆయన, వాళ్ళ అబ్బాయికి ఇస్తారు కాని, తనకు ఎందుకు ఇస్తారు అని అనుమానిస్తూ, స్కూలుకు వెళ్ళాడు రమేశ్. ఇంతలో, ఆ పక్క ఊరి స్కూలు హెడ్మాస్టారు, పరమేశం గారు కూడా అక్కడ ఉండటం చూసి, ఇక పని అవ్వదు అనుకుంటూ, హెడ్మాస్టారుగారి రూము బయట నిలబడి వింటున్నాడు రమేశ్.

"అదేంటండి, మీ అబ్బాయికి కాదని రమేశ్ కి ఇవ్వమంటారా? నాకేమి అభ్యంతరం లేదు. కానీ, నాకు మీ ఆలోచన అర్థం కాలేదు" అడిగాడు పరమేశం గారు.

“పరమేశం గారు, నాకు మాత్రం మా వాడు వృద్ధిలోకి రావాలని లేదా? అయితే, ఇక్కడే వుంటే వాడు కాస్త నా దగ్గర వేదం, పూజలు నేర్చుకోవచ్చు. వాడికి పెద్ద వుద్యోగం రాకున్నా, నా స్థానంలో ఇక్కడి స్కూలులో టీచరు ఉద్యోగం చేసుకునేంత చదువు వస్తే చాలు. నా తర్వాత, ఎటూ ఆ గుడి కూడా చూసుకోవాలి. రమేశ్ అయితే, వాడే కాదు, వాడి కుటుంబం, ఆ పేట కూడా కాస్త బాగుపడుతుంది. వాడు మంచి చదువు చదువుకుంటే, వాడిని చూసి ఆ పేటలో మిగతా పిల్లలు చదువుకోడానికి కాస్త ముందుకు వస్తారు” వివరించారు శర్మగారు.

“మీలాంటి వారి వల్లే ఇంకా వర్షాలు కాస్త పడుతున్నాయి. సరే, అలాగే కానిద్దాం” పరమేశంగారు కూడా ఏకీభవించారు.

ఇంకొద్ది సేపట్లో ఇద్దరూ బయటకి వస్తారు అని గ్రహించి, చమర్చిన కళ్ళతోనే పరుగు లంఘించుకున్నాడు రమేశ్. ఆ రోజు కూడా, కోనేటి మెట్ల మీద ఇలానే కూర్చుని. తన మనస్సులో ఉన్న సందిగ్ధాలన్నీ పక్కకు తోసి, కేవలం చదువు మీద ధ్యాస కుదుర్చుకున్నాడు.

★★★★★★★★★

గతాన్ని తలచుకోగానే, కళ్ళు మళ్ళీ చెమర్చాయి. తన్ని తమాయించుకుని, శర్మ గారిని, అదే, పెద పంతులుగారిని కలుసుకుని, ఆయన పెన్షన్ గురించి తెలుసుకుందామని బయలుదేరాడు.

★★★★★★★

Click here to share your comments on this story